RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 90 | ఏప్రిల్ 20 సోమవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 90 | April 20 Monday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

2

## ఎయిర్‌పోర్టులో ఇద్దరు అదుపులోకి..

**అనుమానాస్పదంగా ఉండడంతో భద్రతా బలగాల చర్యలు**




జమ్మూకాశ్మీర్ జనసంఘర్షణ:
జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతా బలగాలు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా 'శాటిలైట్ ఫోన్' తీసుకెళ్తున్నందుకు ఒక అమెరికా పౌరుడితో పాటు, భారత్‌కు చెందిన మరో వ్యక్తిని అధికారులు నిర్బంధించారు. జమ్ముకశ్మీర్ వంటి అత్యంత సున్నితమైన ప్రాంతంలో ఈ పరికరం

## మా ప్రతిపాదనలు అంగీకరించకుంటే తీవ్ర పరిణామాలు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ జనసంఘర్షణ
అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరుకున్నాయి. హార్మూజ్ జలసంధి కేంద్రంగా ఇరు దేశాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము ప్రతిపాదిస్తున్న ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని, ఇకపై తాను ఏమాత్రం ఉపేక్షించబోనని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన తనకు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ లో సుదీర్ఘమైన పోస్ట్‌ను షేర్ చేశారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ వ్యవహరిస్తున్న తీరుపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిన్న హార్మూజ్ జలసంధిలో ఇరాన్ కాల్పులు జరిపింది. ఇది మన కాల్పుల విరమణ ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘించడమే! ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నౌకలే లక్ష్యంగా వారు ఈ కాల్పులు జరిపారు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అమెరికా నావికాదళం ఇరాన్ పోర్టులను దిగ్బంధించిన నేపథ్యంలో, ఇరాన్ కూడా హార్మూజ్ జలసంధిని మూసివేస్తూ సవాల్


➢ మిగతా 2వ పేజిలో..



## హైదరాబాద్‌లో రాళ్లవాన

హైదరాబాద్ జనసంఘర్షణ
హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురుస్తోంది. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతోంది. సికింద్రాబాద్ బోయిన్ పల్లి పరిసర ప్రాంతాలలో వడగళ్ల వర్షం కురిసింది. బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని వివిధ ప్రాంతాల్లో వడగండ్ల వాన కురుస్తోంది. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్‌టీయూ , నిజాంపేట్, కేపీహెచ్‌బీకాలనీ, ప్రగతి నగర్ బాచుపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం అకస్మాత్తుగా వడగళ్ల వాన కురిసింది. వేడి వాతావరణం కొనసాగుతున్న సమయంలో

➢ మిగతా 2వ పేజిలో..



## క్రమంగా కోలుకుంటున్నా..

**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి**



హైదరాబాద్ జనసంఘర్షణ
తాను క్రమంగా కోలుకుంటున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం ఆయనకు శస్త్రచికిత్స జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. సర్జరీ విజయవంతమైందని, తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతోపాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ.. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారని చిరంజీవి చెప్పారు. వైద్యుల సూచన మేరకు సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చునని తెలిపారు. ఆందోళన

➢ మిగతా 2వ పేజిలో..

## మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం ముందుకు రావాలి

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్ జనసంఘర్షణ :
మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి కేంద్రం ఈ సీజన్‌లో నైనా ముందుకు రావాలని , కొనుగోలు చేస్తున్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి, పూర్తిగా కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. రైతుల ఆదాయాన్ని పదేళ్లలో 2024 కల్లా రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మంత్రి తుమ్మల విమర్శించారు. పంటలకు మద్దతు ధర ప్రకటించడం, ప్రతి సంవత్సరం పెంచడం వరకే కేంద్రం పరిమితమైందని, వాస్తవ కొనుగోళ్ల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. మద్ధతు ధరకు మార్కెట్ ధరకు భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు

➢ మిగతా 2వ పేజిలో..



## దత్తపుత్రుడు జగన్ తెర తొలగింది

**జగన్‌పై వైఎస్ షర్మిల విమర్శలు**

అమరావతి జనసంఘర్షణ
దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు.

➢ మిగతా 2వ పేజిలో..



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# మా ప్రతిపాదనలు అంగీకరించకుంటే తీవ్ర పరిణామాలు

**మొదటిపేజీ తరువాయి..** విసిరిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ట్రంప్.. "జలసంధి మూసివేత వల్ల ఇరాన్‌కే రోజుకు వి500 మిలియన్ల నష్టం వాటిల్లుతోంది. అమెరికాకు ఎలాంటి నష్టం లేదు. వాస్తవానికి ఈ పరిస్థితుల వల్ల చాలా నౌకలు ఇప్పుడు అమెరికాలోని టెక్సాస్, లూసియానా, అలాస్కా పోర్టులకు వస్తున్నాయి" అని ఎద్దేవా చేశారు. పవర్ ప్లాంట్లు, వంతెనలు నాశనం చేస్తాం సమస్య పరిష్కారానికి పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో సోమవారం నుంచి రెండో విడత చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ తన వ్యాఖ్యల తీవ్రతను పెంచారు. "మేము చాలా న్యాయమైన, సహేతుకమైన డీల్‌ను ఆఫర్ చేస్తున్నాం. వారు దాన్ని అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. ఒకవేళ వారు దానికి ఒప్పుకోకపోతే... ఇరాన్‌లోని ప్రతి ఒక్క పవర్ ప్లాంట్‌ను, ప్రతి వంతెనను అమెరికా నాశనం చేస్తుంది. నో మోర్ మిస్టర్ నైస్ గై (ఇక మంచివాడిగా ఉండేది లేదు). ఈ డీల్‌కి అంగీకరించకపోతే.. గత 47 ఏళ్లలో ఇతర అధ్యక్షులు చేయాల్సిన పనిని ఇప్పుడు నేను చేస్తాను. ఇరాన్ కిల్లింగ్ మెషీన్‌ను అంతం చేసే సమయం ఆసన్నమైంది!" అని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

ఇస్లామాబాద్ వేదికగా రెండో విడత చర్చలు యురేనియం సుసంపన్నతపై తక్షణ పరిమితులు విధించాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ తిరస్కరించడంతో ఇస్లామాబాద్‌లో గత వారం జరిగిన తొలి విడత చర్చలు విఫలమయ్యాయి. ఇప్పుడు రెండో విడత చర్చల కోసం తన ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు సోమవారం సాయంత్రం ఇస్లామాబాద్ చేరుకుంటారని ట్రంప్ ధృవీకరించారు. అయితే, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ దఫా చర్చలకు హాజరుకావడం లేదని స్పష్టం చేశారు.

ఒప్పందం ఇంకా దూరమే అన్న ఇరాన్.. ముగియనున్న గడువు

చర్చల విషయమై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ గలీబాఫ్ స్పందించారు. "వాషింగ్టన్‌తో చర్చల్లో కొంత పురోగతి ఉన్నప్పటికీ, ఇంకా చాలా అగాధాలు, కొన్ని ప్రాథమిక పాయింట్లు అలాగే ఉన్నాయి. మేము తుది ఒప్పందానికి ఇంకా చాలా దూరంలో ఉన్నాము" అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా తమ పోర్టులపై దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు హార్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ పరిమితంగానే ఉంటుందని తేల్చి చెప్పారు. ఏప్రిల్ 22 నాటికి ఇరు దేశాల మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగియనుంది. ఈ లోపు ఒప్పందం కుదరకపోతే అమెరికా కఠిన ఆంక్షలు విధించడంతో పాటు, ఇరాన్ అణు, సైనిక స్థావరాలపై ప్రత్యక్ష దాడులకు దిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# హైదరాబాద్‌లో రాళ్లవాన

**మొదటిపేజీ తరువాయి..** ఒక్కసారిగా గాలివానతో పాటు వడగళ్ల వర్షం పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వర్షం కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, గాలులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు సంభవిస్తున్నాయని, వచ్చే కొన్ని గంటలు కూడా ఇలాంటి పరిస్థితులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చింతల్, పద్మనగర్‌లో గాలి వాన ధాటికి వేర్లతో సహా భారీ వృక్షం కూలింది. చెట్టు దాటికి రెండు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో రహదారులపైకి వాన నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీవర్షమే పడింది. కొన్నాళ్లుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడి ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు స్వాంతన పొందారు.

## దత్తపుత్రుడు జగన్ తెర తొలగింది

**మొదటిపేజీ తరువాయి..** విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్ఎస్ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధించాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జనసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు.అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుపడాలని షర్మిల అన్నారు. ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా..? బీజేపీ బిల్లులకు గొర్రెలా, గుడ్డిగా తలాడించాలా..? మోదీ మెప్పు కోసం సొంత కాకిలెక్కలు అల్లాలా..? అని నిలదీశారు. ఇదేనా తమరు చెప్పే వైఎస్ఆర్ ఆశయాలు, వారసత్వం..? అని ప్రశ్నించారు. మహానేత సిద్ధాంతాలను మంటగలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు ఆత్మవిమర్శ చేసుకోవాలి అన్నారు.

రాజ్యాంగానికి విఘాతం కలిగించే అక్రమ బిల్లులకు విపక్షాలు అడ్డుపడి విజయం సాధిస్తే... ఏం సాధించారని ప్రశ్నించడం హాస్యాస్పదమని, కోట్లాది మంది రాష్ట్ర ప్రజల గుండెలు గాయపరచడమే మీ గొప్పతనమా అని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాల భావోద్వేగాన్ని అర్థం చేసుకోకపోవడమా మీ రాజకీయం..? అన్నారు. ప్రతిపక్షంగా విపక్షానికి మద్దతు ఇవ్వాల్సిందిపోయి అధికార పక్షానికి జై కొట్టడం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా..? అని ప్రశ్నించారు. జగన్.. మీరు చేసిన నీచపు పనికి వైఎస్ ఆత్మ నిజంగా ఘోషిస్తోంది అన్నారు.

# ఎయిర్‌పోర్టులో ఇద్దరు అదుపులోకి..

**మొదటిపేజీ తరువాయి..** దొరకడం తీవ్ర కలకలం రేపింది. ఏప్రిల్ 19, 2026న ఆదివారం శ్రీనగర్ విమానాశ్రయంలో భద్రతా అధికారులు ప్రయాణికుల లగేజీని సాధారణ తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు ప్రయాణికుల బ్యాగుల్లో ఒక అనుమానాస్పద పరికరం ఉన్నట్లు గుర్తించారు. దాన్ని పరిశీలించగా, అది 'గార్మిన్' కంపెనీకి చెందిన శాటిలైట్ ట్రాకర్/కమ్యూనికేటర్ అని తేలింది. వెంటనే వారిద్దరినీ అదుపులోకి తీసుకున్న విమానాశ్రయ భద్రతా సిబ్బంది.. ప్రాథమిక విచారణ అనంతరం తదుపరి దర్యాప్తు నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. అరెస్టయిన వ్యక్తుల్లో ఒకరిని అమెరికాలోని మోంటానాకు చెందిన జెఫ్రీ స్కాట్ ప్రాథర్ గా అధికారులు గుర్తించారు. అతనితో పాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తిని హల్దార్ కౌశిక్ గా నిర్ధారించారు. కౌశిక్ స్వస్థలం పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా అని కొన్ని నివేదికలు చెబుతుండగా, అతను కూడా అమెరికాలోనే స్థిరపడ్డాడని మరికొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్‌లో శాటిలైట్ ఫోన్ల వినియోగంపై ఉన్న నిబంధనలు ఇవే భారతదేశంలో పౌరులు అనుమతి లేకుండా శాటిలైట్ ఫోన్లు లేదా ట్రాకింగ్ పరికరాలను ఉపయోగించడం, తమ వెంట తీసుకురావడంపై కఠిన ఆంక్షలు ఉన్నాయి. ముందస్తు అనుమతి తప్పనిసరి: ఎవరైనా విదేశీయులు లేదా భారతీయులు దేశంలోకి శాటిలైట్ ఫోన్‌ను తీసుకురావాలంటే 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్' (ఙశీ) నుండి ముందస్తు లైసెన్స్ పొందడం తప్పనిసరి. విమానాశ్రయంలో అడుగుపెట్టగానే ఆ పరికరం గురించి అధికారులకు డిక్లేర్ చేయాలి. నిషేధిత సర్వీస్ ప్రొవైడర్లు: థురాయా ఇరిడియం వంటి సర్వీస్ ప్రొవైడర్లకు చెందిన హ్యాండ్‌సెట్‌ల వాడకం భారత్‌లో పూర్తిగా నిషేధించబడింది.

చట్టపరమైన చర్యలు: అనుమతి లేకుండా వీటిని కలిగి ఉంటే 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం', ఇతర భద్రతా నిబంధనల ప్రకారం పరికరాన్ని సీజ్ చేయడమే కాకుండా, భారీ జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

జమ్ముకశ్మీర్‌లో భద్రతా ఆందోళనలు

జమ్ముకశ్మీర్ భద్రతా పరంగా అత్యంత సున్నితమైన ప్రాంతం. పాకిస్థాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు సమాచార మార్పిడి కోసం ఇలాంటి శాటిలైట్ ఫోన్లనే ప్రధానంగా ఉపయోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో అమెరికా పౌరుడి వద్ద ఈ కమ్యూనికేషన్ పరికరం దొరకడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. వీరు కశ్మీర్‌కు ఎందుకు వచ్చారు? ఈ శాటిలైట్ ఫోన్ ఎవరి కోసం తెచ్చారు? అనే కోణంలో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

# క్రమంగా కోలుకుంటున్నా..

**మొదటిపేజీ తరువాయి..** చెందాల్సిన అవసరం లేదన్నారు. 'మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు' అని చెప్పారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. 'ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను' అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారని పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దామని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. దీనికి పవన్ స్పందిస్తూ.. నా ఆరోగ్యం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ.. నేను క్రమంగా కోలుకుంటున్నా అని పేర్కొంటున్నారు. మీ ఆదరణకు కృతజ్ఞుడను అని బదులిచ్చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలని తమ సందేశాల్లో పేర్కొన్నారు. సినీ పరిశ్రమ నుంచి జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్ వంటి ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అందరి ప్రేమ, ఆప్యాయతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రకాశ్ రాజ్‌పై వందకోట్లకు పరవునష్టం

### కేసు దాఖలు చేసిన టిటిడి బోర్డ్ సభ్యుడు భాను

**తిరుపతి, ఏప్రిల్18 :** నటుడు ప్రకాశ్ రాజ్‌పై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి పరువు నష్టం దావా వేశారు. రామలక్ష్మణులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్లకు దావా వేశారు. భాను ప్రకాశ్ తరఫు న్యాయవాది.. ప్రకాశ్ రాజ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. హిందువుల మనోభావాలు కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేశారని భాను ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో రామ లక్ష్మణులపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. రామలక్ష్మణులు ఉత్తరభారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలు అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరభారత దేశానికి చెందిన రామలక్ష్మణులు.. దక్షిణాదికి చెందిన రావణుడి పొలంలో పండ్లను దొంగతనం చేశారని అన్నారు. అయితే రామలక్ష్మణులను వలస కూలీలు అంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

**మొదటిపేజీ తరువాయి..** కూడా పంటల కొనుగోళ్లకు రాష్ట్రాలకు మద్దతు ఇవ్వకపోవడం ఏ రకంగా రైతులు అర్థం చేసుకోవాలి.? రైతు ఆదాయం రెట్టింపు చేస్తామన్న మాటలు ఏమయ్యాయో కేంద్రం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో పండిన పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకుండా, కేంద్ర పరిమితులు విధించడం రైతుల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని ఆయన అన్నారు. ముఖ్యంగా అధికంగా వరి ఉత్పత్తి అయినప్పటికీ, ధాన్యం సేకరణను ప్రతి సంవత్సరం తగ్గించడం, దొడ్డు బియ్యం సేకరణ విషయంలో మాట మార్చడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని తెలిపారు. సోయాబీన్, చిక్కుడు, వేరుశనగ, పెసలు, పొద్దుతిరుగుడు వంటి పంటల విషయంలో మొత్తం ఉత్పత్తిలో కేవలం 25 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం పరిమితులు విధించడం వల్ల, మిగిలిన పంటను మద్దతు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సి వస్తోందని చెప్పారు. దీనివల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతోందని తెలిపారు.

తెలంగాణలో విస్తృతంగా పండే మొక్కజొన్న పంట విషయంలో కూడా కేంద్రం కేవలం మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా దానిని ప్రతి సంవత్సరం పెంచుకుంటు పోయిన కేంద్రం ఆ మద్దతు ధర రైతులకు దక్కుతుందా లేదా అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదని, వాటి కొనుగోళ్ల కోసం రాష్ట్రానికి ఏ మాత్రం చేయూత ఇవ్వడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుతో రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని స్థితిలో పడుతున్నారని, బహిరంగ మార్కెట్లో మద్దతు ధర లభించక ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు.

కానీ రైతుల శ్రేయస్సు దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం కేంద్రం విధించిన పరిమితులకు మించిన పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు మొక్కజొన్న పంటను కూడా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి వివరించారు. ఇందుకోసం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని, దీనివల్ల రాష్ట్రంపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంట మొత్తాన్ని సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం, కనీసం యాసంగి సీజన్‌లో అయినా కేంద్రం కొనుగోళ్లలో అనుమతులు ఇస్తుందని ఆశించినప్పటికీ, ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటికే 200కి పైగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 1,20,000 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను ఈ రోజు వరకు మద్దతు ధరకు రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు చెప్పారు. మార్కెట్ ధర మద్దతు ధర కంటే రూ.700 తక్కువగా ఉండటంతో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోళ్లు ఆరంభించినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా తగ్గిస్తున్న లెవి అడ్డంకిగా మారుతుందని, పత్తి విషయంలో కొత్త పద్ధతి తీసుకురావాలి అని చూస్తుంది అని, వీటిని కూడా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించడాన్ని మంత్రి గుర్తుచేశారు.

మొక్కజొన్న పంటను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నాఫెడ్ ద్వారా కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని, అలాగే శనగ, పొద్దుతిరుగుడు పంట కొనుగోళ్లపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి, పూర్తిగా కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికి, ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు అందించాలని మంత్రి తుమ్మల లేఖ ద్వారా మరోమారు కోరారు.

## స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

### పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్18 :** ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## సంక్షేమమా? సారాయా?: ధనియాలపాడు పంచాయతీ 'సంచలన' సంస్కరణ!

ఇల్లందు ఏప్రిల్ 18 (జన సంఘర్షణ)
గ్రామీణ వ్యవస్థలో పంచాయతీ అంటే కేవలం వీధి దీపాలు, డ్రైనేజీల నిర్వహణే కాదు.. గ్రామ భవిష్యత్తును దిశానిర్దేశం చేసే ఒక అత్యున్నత వేదిక అని ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పంచాయతీ నిరూపించింది. యువతను నిర్వీర్యం చేస్తున్న నాటు సారాయి రక్కసిపై సర్పంచ్ సనప సావిత్రి వెంకన్న నేతృత్వంలో తీసుకున్న కఠిన నిర్ణయం ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేవలం పోలీసు కేసులు, పీడీ యాక్టులకే పరిమితం కాకుండా, అక్రమ విక్రయాలకు పాల్పడే వారి ప్రభుత్వ ఫలాలు (రేషన్, పెన్షన్) కట్ చేస్తామన్న హెచ్చరిక.. అసాంఘిక శక్తుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది. అభివృద్ధి అంటే భవనాలు కట్టడం మాత్రమే కాదు, ఒక తరాన్ని వ్యసనాల ఊబి నుంచి బయటకు లాగడం కూడా అని ఈ తీర్మానం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పొందుతూ, అదే సమాజానికి చేటు చేసే పనులు చేయడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నను ఈ నిర్ణయం ప్రజల ముందు ఉంచింది. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచిన ఈ 'ఉక్కుపాదం' కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమలు జరిగినప్పుడే ధనియాలపాడు బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయి. నాయకత్వం




అంటే ఓట్లు వేయించుకోవడం కాదు, ఊరి బాగు కోసం కఠినంగా నిలబడటమేనని ఈ సంచలన తీర్మానం మరోసారి చాటిచెప్పింది.

# హక్కుల వేటలో 'కార్మిక' గర్జన

**❑ ఢిల్లీ పీఠాన్ని కదిలించేలా సమరశంఖం!**

ఇల్లందు ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
దేశ ఆర్థిక చక్రానికి వెన్నెముకగా నిలిచే కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఇప్పుడు పోరుబాట మొదలైంది. కేంద్రం ప్రతిపాదించిన 4 లేబర్ కోడ్లు కార్మికులకు రక్షణ కవచాలుగా కాక, వారి బతుకులను ఛిన్నాభిన్నం చేసే మారణాయుధాలుగా మారాయన్న ఆందోళనల మధ్య ఐఎన్టీయూ సమరశంఖం పూరించింది. ఇల్లందు జిల్లా కమిటీ వేదికగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఇచ్చిన 'లేబర్ డిమాండ్స్ డే' పిలుపు.. కేవలం ఒక నిరసన కాదు, అది శ్రమజీవుల ఆత్మగౌరవ పోరాటం. కనీస వేతనం రూ.30 వేలు ఉండాలని, దశాబ్దాలుగా వెట్టిచాకిరి చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల బతుకుల్లో క్రమబద్ధీకరణ వెలుగులు నింపాలని ఆయన చేసిన డిమాండ్లు ప్రభుత్వ కళ్లు తెరిపించేలా ఉన్నాయి. అభివృద్ధి అంటే ఆకాశహర్మ్యాల నిర్మాణం కాదు, ఆ నిర్మాణానికి చెమట చిందించిన కార్మికుడి కడుపు నింపడం అని ఈ వేదిక గట్టిగా చాటిచెప్పింది. హక్కుల కోసం చేసే ఈ పోరాటం కేవలం కార్మికులకే పరిమితం కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. ఎందుకంటే శ్రమ దోపిడీకి గురవుతున్న చోట సంపద సృష్టి జరగదు, కేవలం అసమానతలు మాత్రమే పెరుగుతాయి. ఈ నెల 21న జరగబోయే నిరసన, పాలకుల మొండివైఖరిని మార్చి, కార్మిక పక్షపాత నిర్ణయాలకు నాంది పలకాలని ఆకాంక్షిద్దాం.



# మృత్యువు వాకిట మృత్యుంజయుడు

**❑ ఇల్లందు వైద్యుల 'ప్రాణ' స్పందన!**

ఇల్లందు ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
ఆధునిక వైద్య రంగం కేవలం యంత్రాల మీద మాత్రమే కాదు, వైద్యుడి సంకల్ప బలం మీద కూడా ఆధారపడి ఉంటుందని ఇల్లందు ఏరియా ఆసుపత్రి వైద్యులు మరోసారి నిరూపించారు. కేవలం మూడు నెలల వయసున్న పసిగుడ్డు, శ్వాస ఆగిపోయి, గుండె స్పందన నిలిచిపోయి.. మృత్యువుతో పోరాడుతున్న క్లిష్ట సమయంలో డాక్టర్ అజ్మీరా భగత్ సింగ్ బృందం ప్రదర్శించిన తెగువ అద్భుతమనే చెప్పాలి. మూడు దఫాలుగా విరామం లేకుండా సీపీఆర్ నిర్వహిస్తూ, అడ్రినలిన్ డోసుల ద్వారా ఆ పసి ప్రాణాన్ని వెనక్కి తీసుకురావడానికి వారు చేసిన ప్రయత్నం కేవలం డ్యూటీ మాత్రమే కాదు, అది ఒక పవిత్రమైన యజ్ఞం. యమధర్మరాజుతో పోరాడి సావిత్రి ప్రాణాలు దక్కించుకున్నట్టు, వైద్యుల అలుపెరుగని పోరాటంతో ఆ చిన్నారి గుండె మళ్లీ కొట్టుకోవడం ప్రారంభించడం మానవత్వానికి లభించిన గొప్ప విజయం. అభివృద్ధి అంటే కేవలం పెద్ద భవనాలు, రోడ్లు కాదు.. ఒక సామాన్యుడికి అత్యవసర సమయంలో ప్రాణదానం చేసే సమర్థవంతమైన వైద్య సదుపాయాలే నిజమైన ప్రగతి. ప్రతికూల పరిస్థితుల్లో కూడా పట్టు వదలకుండా పోరాడితే మృత్యువునైనా ఓడించవచ్చని ఈ ఘటన నిరూపించింది. ఖమ్మం ఆసుపత్రికి తరలించిన ఆ చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని కోరుకుందాం; ఎందుకంటే ఆ గుండె చప్పుడు వెనుక ఒక వైద్యుడి శ్రమ, ఒక తల్లి నిరీక్షణ, ఒక సమాజపు ఆశ దాగి ఉన్నాయి.




## దిండిగాల ఆధ్వర్యంలో ఛలో ఖమ్మం ప్లీనరీకి భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఇల్లందు ప్రతినిధి:( జన సంఘర్షణ)
ఖమ్మంలో ఈ రోజు నిర్వహించబడుతున్న బీఆర్ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో పార్టీ శ్రేణులు భారీగా తరలిపోయారు. బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ నాయకత్వంలో ర్యాలీగా ఉత్సాహంగా బయలుదేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు "జై తెలంగాణ", "జై కేసీఆర్", "జై హరీష్" అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణం నెలకొల్పారు. కార్యక్రమంలో ఇల్లందు మండల అధ్యక్షులు శీలం రమేష్, పట్టణ అధ్యక్షులు జబ్బార్ మొహమ్మద్, పాల్వంచ అధ్యక్షులు రాజుగౌడ్, టీబీజీకేఎస్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ రంగనాథ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె. అబ్దుల్ నబి తదితరులు పాల్గొన్నారు. అలాగే దేరంగుల పోశం, టేకులపల్లి ఉపాధ్యక్షులు చీమల సత్యనారాయణ, సుదిమల్ల సర్పంచ్ సుగుణయ్య, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, వసంతరావు, ఎస్.కె. ఘాజీ, మూలగుండ్ల ఉపేందర్రావు, లలిత్ చిన్నారి, మునిగంటి శివ, పరికబల్లి రవి గౌడ్, ఎంటెక్ మహేందర్, ఈదుల ముత్తయ్య, శ్రీకాంత్, సునీల్, గడ్డి శ్రీను, రాచపల్లి శ్రీను, గద్దె రమేష్, భాగ్య, ఇర్ప పుల్లయ్య, బుగ్గ రమేష్, కుంజ సందీప్ తదితరులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ప్లీనరీని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిస్తూ, పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సూచించారు.



## అటవీ గర్భంలో 'అదృష్ట' వేట: ఖనిజ సంపదపై క్షుద్ర నీడలు!

కొత్తగూడెం ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
విజ్ఞాన శాస్త్రం చంద్రుడిపై అడుగులు వేస్తున్న తరుణంలో, ఇంకా మారుమూల అడవుల్లో గుప్తనిధుల పేరిట జరుగుతున్న తవ్వకాలు నాగరిక సమాజానికే సవాలు విసురుతున్నాయి. మణుగూరు, అశ్వాపురం అటవీ ప్రాంతాల్లో ఛత్తీస్‌గఢ్ మాంత్రికుల అండతో, అర్ధరాత్రి వేళల్లో జేసీబీలు పెట్టి ఏకంగా 14 చోట్ల గోదావరి తీరాన్ని తవ్విపోస్తుంటే.. యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. రాజుపేట అడవుల్లో క్షుద్రపూజల నెపంతో పాత నేరస్థులు సాగిస్తున్న ఈ 'నిధి' దందా వెనుక అమాయకుల ఆశలను పెట్టుబడిగా మార్చుకుంటున్న భారీ మాఫియా దాగి ఉంది. కేవలం భూమిని తవ్వడమే కాదు, ప్రకృతి సమతుల్యతను, సామాన్యుల నమ్మకాన్ని ఈ ముఠా తుత్తునీయలు చేస్తోంది. కట్టుదిట్టమైన నిఘా ఉండాల్సిన రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోకి జేసీబీలు ఎలా ప్రవేశించాయనేది ఇప్పుడు అటవీ శాఖ పనితీరుపై మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు వేయడం కాదు, ఇలాంటి అసాంఘిక శక్తుల నుంచి ప్రకృతిని, ప్రజలను కాపాడటం కూడా. పోలీసులు తక్షణమే స్పందించి ఈ మూఢనమ్మకాల ముసుగులో జరుగుతున్న దోపిడీకి చరమగీతం పాడకపోతే, రేపు ఈ అడవి కేవలం స్మశాన నిశ్శబ్దానికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. నాయకత్వం అంటే సంఘటనలు జరిగాక స్పందించడం కాదు, అవి జరగకుండా అడ్డుకోవడమే అని గుర్తుంచుకోవాలి.



## ఇల్లందులో కాంగ్రెస్ మహిళా శంఖారావం!



ఇల్లందు ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
రాజకీయాల్లో మార్పు ఎప్పుడూ అట్టడుగు స్థాయి నుంచే మొదలవుతుంది. అదే స్ఫూర్తితో ఇల్లందు రెండో వార్డులో నిర్వహించిన కాంగ్రెస్ మహిళా కమిటీ అత్యవసర భేటీ కేవలం ఒక సమావేశంగా కాక, పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు ఒక వేదికగా నిలిచింది. పట్టణ మహిళా అధ్యక్షురాలు గాలిపల్లె స్వరూప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీ బలోపేతంలో మహిళల పాత్ర ఎంత కీలకమో గుర్తుచేశారు. గడప గడపకు పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లడంలో మహిళలే అసలైన వారధులని, వ్యవస్థాగత మార్పు కోసం క్షేత్రస్థాయిలో వారు చేసే కృషి వెలకట్టలేనిదని ఈ సందర్భంగా వారు దిశానిర్దేశం చేశారు. ఐదో వార్డు కౌన్సిలర్ భారతితో పాటు పలువురు నాయకురాళ్లు పాల్గొన్న ఈ భేటీ, కేవలం రాజకీయ ప్రసంగాలకు పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతతో కూడిన రాజకీయాల్లో మహిళా శక్తి ఎలా ప్రభావితం చేయగలదో ప్రతిబింబించింది. నిజమైన నాయకత్వం అధికారం కోసం కాదు, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడానికి అని చాటిచెప్పేలా ఈ సమావేశం సాగింది.

## అశ్వారావుపేట హార్టికల్చర్ హబ్

**❑ ఉద్యాన సాగులో సరికొత్త అధ్యాయం!**

కొత్తగూడెం ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
మారుతున్న కాలంతో పాటు వ్యవసాయ ముఖచిత్రం మారాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ, ఉద్యాన పంటల ఖిల్లాగా పేరొందిన అశ్వారావుపేటలో నూతనంగా ఉద్యాన కళాశాల (హార్టికల్చర్ కళాశాల) ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ ప్రాంత సాగు భవిష్యత్తును మలుపు తిప్పనుంది. రానున్న విద్యా సంవత్సరం నుంచే 30 మంది విద్యార్థులతో బీఎస్సీ కోర్సును ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జారీ చేసిన ఆదేశాలు. కేవలం విద్యావకాశాలను మెరుగుపరచడమే కాకుండా, స్థానిక రైతులకు అత్యాధునిక సాగు పరిజ్ఞానాన్ని చేరువ చేసే ఒక విజ్ఞాన గనిగా మారనుంది. రాష్ట్రంలో నాల్గవ కళాశాలగా రూపుదిద్దుకోనున్న ఈ కేంద్రం, కేవలం డిగ్రీలను అందించే వేదికగా కాకుండా, ప్రయోగాత్మక సాగు విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లే పరిశోధనా కేంద్రంగా విరాజిల్లాలి. నేల స్వభావాన్ని బట్టి పంటలు పండించే విజ్ఞానం రైతు బిడ్డలకు అందుబాటులోకి రావడం అనేది, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా వేసిన ఒక గొప్ప ముందడుగు. విద్యాసంస్థల స్థాపన అనేది భవనాల నిర్మాణం మాత్రమే కాదు, అది ఒక తరాన్ని నైపుణ్యం వైపు నడిపించే చైతన్య దీప్తి అని ఈ నిర్ణయం మరోసారి చాటిచెప్పింది.




## ప్రజాధనం 'మందు'పాలు

**❑ పుష్కర జ్ఞాపకాలపై అధికారుల ఉదాసీనత!**

భద్రాచలం ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
భక్తికి ప్రతిరూపమైన పుష్కర స్మృతులు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డం పట్టడం పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. 2015 పుష్కరాల వేళ కోట్లాది రూపాయల ప్రజాధనంతో బూర్గంపాడు మండలం సారపాకలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన 'పుష్కర వనం', నేడు నిర్వహణ కరువై మందుబాబుల అడ్డాగా రూపాంతరం చెందడం అత్యంత విచారకరం. నాటి సోలార్ వెలుగులు ఆరిపోయి, మొక్కలు ఎండిపోయి, మౌలిక సదుపాయాలు ధ్వంసమై శ్మశాన నిశ్శబ్దాన్ని తలపిస్తున్న ఈ ప్రాంతం అధికారుల పర్యవేక్షణ లేమితో అసాంఘిక శక్తులకు స్వర్గధామంగా మారింది. అభివృద్ధి అంటే కేవలం కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టడం మాత్రమే కాదు, వాటిని ప్రజా ప్రయోజనాల కోసం కాపాడటం కూడా అని పాలక యంత్రాంగం విస్మరించడం శోచనీయం. ఒకప్పుడు పవిత్రతకు చిరునామాగా నిలిచిన చోట నేడు మద్యం సీసాల దర్శనమిస్తుండటం చూస్తుంటే, కోట్ల నిధులు కేవలం కాంట్రాక్టుల కోసమే తప్ప ప్రజల కోసం కాదా అనే ప్రశ్నలు సామాన్యుడి మెదడును తొలిచేస్తున్నాయి. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొని ఈ వనాన్ని పునరుద్ధరించి, ప్రజాధనాన్ని సద్వినియోగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## 'ఫార్మర్ ఐడీ' కేవలం సంఖ్య కాదు.. రైతు హక్కు!

**❑ డిజిటల్ బాటలో అన్నదాత**

ఇల్లందు ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)
వ్యవసాయ రంగంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి రైతుకు నేరుగా అందాలనే లక్ష్యంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగం 'ఫార్మర్ రిజిస్ట్రీ' ప్రక్రియను వేగవంతం చేసింది. ఆదివారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పీఎం కిసాన్, రైతు భరోసా రుణమాఫీ వంటి కీలక పథకాలకు ఈ 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యే (ఫార్మర్ ఐడీ) ప్రాణవాయువు కానుందని స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం నిధుల కేటాయింపు కాదు, ఆ నిధులు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా క్షేత్రస్థాయిలో ఉన్న చివరి రైతు వరకు చేరడమే నిజమైన సుపరిపాలన అని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. సాంకేతికతను సామాన్యుడి చెంతకు చేర్చే ఈ ప్రక్రియలో రైతులు ఏఈవోలు లేదా మీసేవ కేంద్రాలను ఆశ్రయించి వివరాలు నమోదు చేసుకోవడం కేవలం నిబంధన మాత్రమే కాదు, అది తమ సాగు హక్కును భద్రపరుచుకోవడం అని గుర్తించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నదాత డిజిటల్ సంతకాన్ని అలవర్చుకోవడం అనేది వ్యవసాయ రంగంలో జరగబోయే ఒక నిశ్శబ్ద విప్లవానికి నాంది. ప్రభుత్వ వ్యవస్థలు సిద్ధమైనప్పుడు, రైతాంగం కూడా అదే ఉత్సాహంతో స్పందిస్తేనే సమిష్టి లక్ష్యం నెరవేరుతుంది. ఇప్పటికైనా రైతులు మేల్కొని, తమ వివరాలను నమోదు చేసుకుని భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందుల నుంచి రక్షణ పొందాలని ఈ సమావేశం దిశానిర్దేశం చేసింది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
సోమవారం
20 ఏప్రిల్ 2026

# సొసైటీ కార్యాలయానికి తాళం వేసి రైతుల నిరసన

- బాన్సువాడ నియోజకవర్గం పోచారం శ్రీనివాస్ రెడ్డి నాలుగు తరాలుగా ఎమ్మెల్సీ మంత్రి చేసిన స్పీకర్ చేసిన ఇప్పుడు ఆయన ఇలాకాలో రైతులకు ఇబ్బంది.
- అయ్యా పెద్దాయన మీ ఇలాకాలో రైతులకు ఇబ్బంది కొద్దిగా చూడండి, రైతుల బాధ పార్టీ మారిన రైతుల బాధ తప్పడం లేదు పెద్దాయనకు.



బీర్కూర్ బైరాపూర్/ఏప్రిల్19/ (జన సంఘర్షణ)

బీర్కూర్ మండలంలోని బైరాపూర్‌లో రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. సొసైటీ పరిధిలో ధాన్యానికి కాంటాలు వేయడం లేదని సొసైటీ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ పరిధిలో ధాన్యానికి కాంటాలు వేయకపోవడం, ఇతర గ్రామాలకు మాత్రం ప్రాధాన్యం ఇస్తున్నారంటూ రైతులు ఆరోపించారు. ఆగ్రహానికి లోనైన రైతులు సొసైటీ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు.

**వారం రోజులుగా..**

గత వారం రోజులుగా సొసైటీ కార్యదర్శి విధులకు హాజరు కాకపోవడంతో పాటు, ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ, హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో, కోసిన ధాన్యం తడిసిపోతుందనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈనెల 4న కోసిన వడ్లకు ఇప్పటివరకు కాంటాలు వేయకపోగా 18న కోసిన వడ్లకు మాత్రం వెంటనే కాంటాలు వేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల మధ్యవివక్ష చూపకుండా వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# పోతంగల్‌లో ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు





పోతంగల్ ఏప్రిల్/19/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కేంద్రంలోని బస్టాండ్ వద్ద బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ప్రారంభించారు. భక్తి పాటలతో భజన కార్యక్రమం ఆడపడుచులు మంగళహారతులతో ఘనంగా నిర్వహించారు. శివకుమార్ గురూజీ మాట్లాడుతూ.. బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ తత్వవేత్త, కవి, సంఘ సంస్కర్త. ఆయన కుల వ్యవస్థను, లింగ వీక్షను వ్యతిరేకించి, లింగాయత్ ధర్మాన్ని స్థాపించాడు. కావమే కైలాసం (శ్రమమే స్వర్గం) అని చాటి సమాజంలో అందరూ సమానమే బోధించిన వీర శైవభక్తి ఉద్యమ నాయకుడు. కర్ణాటకలోని బాగేవాడిలో జన్మించారు. ఆయన శివుని ఆరాధ్యకుడైన వీరశైవ మత ప్రచారకుడు. కులమత బేధాలను నిరసిస్తూ, అందరూ ఈశ్వరుని కులస్తులే శివ భక్తులని ప్రతిపాదించాడు. ఈ కార్యక్రమంలో పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, బాన్స్వాడ బిజెపి నాయకులు కోనేరు శశాంక్, రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, కోటగిరి మండల అధ్యక్షుడు వేముల నవీన్, మెర్కెల్ ప్రకాష్ పటేల్, వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు మాలిపటేల్ శివకుమార్, ఉపాధ్యక్షులు నాగేంద్ర పటేల్, మాణిక్ అప్ప, దిగంబర పటేల్, దొడ్డిమీది ప్రకాష్ పటేల్, పబ్బాశేఖర్, ఎమ్మార్పీఎస్, పోచీరం, ఎక్స్ ఆర్మీ సంజు కుమార్, దొడ్డిమీది విజయ పటేల్, శరత్ పటేల్, మాలిపటేల్ ఓమన్న పటేల్, బస్వంత్ పటేల్, శరత్ పటేల్, వీరశైవ లింగాయత్ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం బీభత్సం..



- తెలంగాణ రాష్ట్రాన్ని అత్తుల కుతులం చేస్తున్న వడగళ్ల వాన
- కామారెడ్డి, మెదక్ జిల్లాలో వడగళ్ల వాన వల్ల భారీ నష్టం



అదిలాబాద్ కామారెడ్డి/ ఏప్రిల్19/ (జన సంఘర్షణ)

గత వర్షాకాలం సీజన్లో నెలరోజుల పాటు ఎడతెరప లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల చేతికి వచ్చిన పంట అంతా పూర్తిగా దెబ్బతిని రైతన్న కోలులేని స్థితికి. వర్షాకాలం సీజన్ సహకరించకున్నా రబ్బీ సీజన్ అయినా సహకరిస్తుందని గంపెడు ఆశలు పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, పత్తి, జొన్న, కూరగాయలు, మామిడి తోటలు ఈ భారీ వర్షాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, అదిలాబాద్, నిర్మల్, గాంధారి, ఎల్లారెడ్డి, నిజామాబాద్, జిల్లాలో ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వాన పంటలకు తీవ్ర దెబ్బతీశాయి. అరకాలం శ్రమించి పండించిన పంట నోటికి వచ్చే సమయంలో అకాల వర్షాలు నట్టేట ముంచుతున్నాయి. ఒకవైపు వడగల్లు, మరొకవైపు ఈదరు గాలులతో పంటలన్నీ నేలకొరిగి పోయాయి. ఈ రబ్బీ సీజన్లో ఆశించిన రీతిలో దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ ఈ అకాల వర్షాలు అన్నదాతల వెంటాడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ధాన్యం, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిలింది. చేతికి వచ్చిన పంటలు నీటి పాలు కాగా, భారీ ఈదర్ గాలులు తో మామిడి కాయ అంత రాలిపోయి మామిడి రైతులు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఈ సీజన్లో ఊహించిన రీతిలో మామిడి తోటలు ఆశించిన రీతిలో ఉండడంతో మామిడి రైతులు ఎంతో సంబరపడ్డారు చివరికి మరో పక్షం రోజుల్లో మామిడి చేతికి వచ్చే సమయంలో భారీ వర్షాలు, ఈదరు గాలులు, వడగళ్ల వాన వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి . అన్నదాత కోలుకోలేని పరిస్థితికి ఈ అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. బాన్సువాడ, బోధన్ మండలాల్లో 70 శాతం దాన్యం పక్క రాష్ట్రాలకు తరలిపోయింది. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోతుందన్న భయంతో అన్నదాత ప్రైవేటు వ్యాపారస్తులకు పచ్చి దాన్యం క్వింటాల్కు 2000 రూపాయలు చొప్పున అమ్మకాలు జరిపారు. వర్ని, బీర్కూర్, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో దాన్యం కొనుగోళ్లు వేగవంతంగా కొన సాగాయి. 50% దాన్యం ప్రైవేటు వ్యాపా రస్తులకు అమ్ము కున్నారు. ఈ యాసంగి సీజన్లో వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, ఆకుకూరలు, నీటిలో మునిగి తేలుతున్నాయి. ఇకపోతే కామారెడ్డి జిల్లాలో గత వర్షాకాలం నుంచి వర్షం వదలడం లేదు. గత వర్షా కాలంలో తెలంగాణ రాష్ట్రంలోనే ఊహించని విధంగా కామారెడ్డి ప్రాంతం భారీ వర్షాలతో అతలాకుతులమైంది. ఇప్పటికీ ఆ ఘటన నుంచి రైతులు, గ్రామాల ప్రజలు తేరుకోక. ముందే మళ్లీ అకాల వర్షాలు వెంటాడుతున్నాయి . కామారెడ్డి, నిజామాబాద్ అన్నదాతలను అకాల వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. చేతికి వచ్చిన పంట భారీ వర్షాల వల్ల, వడగళ్ల వాన వల్ల తీవ్రంగా దెబ్బతిని పెట్టిన పెట్టుబడులు రాక అన్నదాత ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో వరుణ్ణి ప్రతాపం వల్ల పంటలన్నీ చేతికి రాకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తరించిన భక్తజనం: భద్రాద్రి గిరిపై లోకకల్యాణ వైభోగం!



భద్రాచలం ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)

సకల చరాచర సృష్టికి మూలమైన ఆ సీతా రాముల కళ్యాణోత్సవం, భద్రాచల పుణ్యక్షేత్రంలో ఆదివారం నాడు కనుల పండువగా సాగి భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. తెల్లవారుజాము నుంచే అర్చక స్వాములు ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించిన విశేష పూజలు, అనంతర ఘనంగా జరిగిన నిత్య కళ్యాణ ఘట్టం.. ఒక ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా మానవ సంబంధాల కలయికకు ప్రతీకగా నిలిచింది. రామనామ స్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం, వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోలాహలం చూస్తుంటే, నమ్మకం అనేది మనిషిని ఎంతటి కష్ట కాలంలోనైనా నిలబెట్టగలదని స్పష్టమవుతోంది. దైవ ప్రార్థన అంటే కేవలం కోరికలు కోరడం కాదు, లోకమంతా సుభిక్షంగా ఉండాలని కోరుకునే విశాల హృదయం అని ఈ వేడుక గుర్తు చేస్తోంది. కళ్యాణం చూసి కైవల్యం పొందిన భక్తుల ముఖాల్లోని ఆనందం, నిత్యం గందరగోళంగా ఉండే ఆధునిక జీవితంలో ఆధ్యాత్మికత ఒక ఊరటనిచ్చే చల్లని నీడ అని చాటిచెప్పింది. భద్రాద్రి రామయ్య నిత్య కళ్యాణం కేవలం ఆలయ ఆచారమే కాదు, అది ఈ గడ్డపై వెల్లివిరుస్తున్న శాంతి, సమరసతలకు నిలువుటద్దం.

# మట్ల వెంకయ్య అకాల మరణం

- కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



ఇల్లెందు ప్రతినిధి. (జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండలం పాత లింగాల గ్రామానికి చెందిన మట్ల వెంకయ్య అకాల మరణం చెందడం పట్ల గ్రామంలో విషాదం నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పుష్పాంజలి ఘటించారు. అలాగే కామేపల్లి మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, ఇల్లందు మార్కెట్ డైరెక్టర్ బౌసింగ్, పాత లింగాల సర్పంచ్ కిన్నెర సుజాత తదితరులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మట్ల వెంకయ్య మృతి పట్ల నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## గుంపెల్లగూడెం గ్రామంలో కరెంట్ తీగల ప్రమాదం ముప్పు



సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )

గుంపెల్లగూడెం గ్రామంలో కరెంట్ స్తంభాల నుంచి తీగలు కిందకు వేలాడుతూ ఉండటంతో తీవ్రమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోని అధికారులు ఎన్నిసార్లు అధికారులకు సంప్రదించిన పట్టించుకోకుండా ఉంటున్నారు. ఈ తీగలు ఎప్పుడైనా తెగిపడి ప్రజలకు, ముఖ్యంగా చిన్నపిల్లలకు ప్రమాదం కలిగించే పరిస్థితి ఏర్పడింది. అందువల్ల గ్రామ సర్పంచ్ గుగులోతు కృష్ణవేణి, పంచాయతీ సెక్రెటరీ సంతోష్ కుమార్, ఉపసర్పంచ్ శంకర్, అలాగే వార్డ్ సభ్యులు అందరూ కలిసి ఈ సమస్యను వెంటనేపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, కరెంట్ శాఖ ఏఈకి సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని గ్రామ ప్రజలు వినమ్రంగా విన్నపం చేస్తున్నారు. ఈ ప్రమాదకర పరిస్థితి వల్ల ఎలాంటి హాని కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ గూగులోత్ కృష్ణవేణి తెలిపారు.

# బంగారు దుకాణంలో చోరి



ముధోల్, ఏప్రిల్ 19(జన సంఘర్షణ ):

తానూర్ మండల కేంద్రంలోని ఇండియన్ నంబర్ వన్ ఎటిఎం సమీపంలో ఉన్న సాయి ప్రసాద్ బంగారు దుకాణంలో చోరీకు పాల్పడి 300గ్రాములు వెండి గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బంగారు దుకాణం యజమాని పేర్కొన్నారు. శనివారం రాత్రి 10 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిన బంగారు దుకాణ్ యజమాని ఆదివారం ఉదయం తెరిచేందుకు వచ్చిన అయన దుకాణం షట్టర్ ను ఇనుప రాడ్లతో వంపి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎస్ఐ షేక్ జుబేర్ దుకాణంలో లోపలికి ప్రవేశించి పరిశీలించారు. 300గ్రాములు వెండి అభరణాలు అపహరించినట్లు దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## ఆసుపత్రిలో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే



భైంసా, ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)

భైంసా లోని సాయి సుప్రియ ఆసుపత్రిలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పలువురిని పరామర్శించారు.. ముధోల్ మాజీ సర్పంచ్ గంట శ్రీనివాస్ అతని మనుమరాలు రోడు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరగడంతో వారిని పరామర్శించారు.. అదే విధంగా అంబకంటి గ్రామానికి చెందిన అరుంధతి అనే మహిళకు ఆపరేషన్ జరుగగా, దౌనెల్లి గ్రామానికి చెందిన ఖాదీర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ప్రముఖ వైద్యులు దామోదర్ రెడ్డి, ముధోల్ మాజీ సర్పంచ్ అనిల్, మాజీ ఎం. పి టి సి. పోతన్న యాదవ్ తో పాటు పలువురు ఉన్నారు.

## ఘనంగా భూలక్ష్మి పండుగ



బీర్కూర్./ఏప్రిల్19/(జన సంఘర్షణ)

బీర్కూర్ మండలకేంద్రంలో భూలక్ష్మి అమ్మవారికి పండుగను భూలక్ష్మి కాలని వాసులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాలనిలో వివిధ కులాల సభ్యులు డప్పువాయిద్యాల మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గుండూరు గంగాధర్ గౌడ్, మాజీ ఎంపిటిసి సుధాకర్ యాదవ్, కొర్రి నాగార్జున యాదవ్, విజయ్ యాదవ్, తరిమెల నరేందర్ గౌడ్ , బర్ల సంజీవ్, బర్ల లాళేశ్వర్, లింగం శ్రీనివాస్, లింగం ప్రవీణ్, కాలని వాసులు గ్రామపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరీ దేవి 42 వార్షికోత్సవం ముగింపు కార్యక్రమం

- అన్నదానంలో పాల్గొన్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్



హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 19( జనసంఘర్షణ )

గాంధీనగర్ డివిజన్, చిక్కడపల్లి, బాపునగార్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయ 42వ వార్షికోత్సవ వేడుకల్లో బాగంగా చివరి మూడు రోజు అన్నదానం కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ప్రారంభించారు. మూడు రోజులుగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారని, నేడు అన్నదానంతో వేడుకలు పూర్తి అయ్యాయని, అమ్మవారి దీవెనలు ప్రజలపై ఎల్లపుడూ వుంటాయని ఈ సందర్భంగా వినయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో బిజెపి నేతలు ఆనంద్ రావు, సాయి కుమార్, నీరజ్, ఆలయ కమిటీ చైర్మన్ జి.దామోదర్, అధ్యక్షుడు సదానంద్, కమిటీ సభ్యులు రాజు, సుదర్శన్ రెడ్డి, సురేష్, అశోక్, జి.కృష్ణ కాంత్, గణేష్ బబ్బి తదితరులు పాల్గొన్నారు.

## తేమ పేరుతో తరుగు.. నిలువునా మోసం

తెలంగాణ బోధన్ /ఏప్రిల్19/(జన సంఘర్షణ)



బోధన్‌లో రైస్ మిల్లర్ల దోపిడీ. తేమ, బస్తా తూకం పేరుతో క్వింటాలుకు 4 కిలోల తరుగు. విండో సిబ్బందితో కుమ్మక్కై రైతులను వేధిస్తున్న మిల్లర్లు. నిలువునా మోసం తేమ పేరుతో తరుగు.. నిలువునా మోసం, బోధన్‌లో రైస్ మిల్లర్ల దోపిడీ. తేమ, బస్తా తూకం పేరుతో క్వింటాలుకు 4 నిజామాబాద్ జిల్లా: బోధన్ డివిజన్ పరిధిలోని వివిధ రైస్ మిల్లర్లు రైతులు నిలవు దోపిడీకి గురి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తే మిల్లర్లు ఇదే ఆధునిక భావించి రైతులను తేనె పేరుతో నీలువు దోపిడి చేస్తున్నట్లు హలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారి వ్యవస్థను అరికట్టేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరిస్తుంది. మిల్లర్లు సిండికేట్ గా మారి రైతుల వద్ద నుండి 40 కిలోల బ్యాగుకు కు కిలోన్నర చొప్పున తేమ పేరుతో, బస్తాతూకమ్ పేరిట క్వింటాలు ధాన్యానికి నాలుగు కిలోల చొప్పున తరుగు తీయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుదురు మండల కేంద్రంలో పాటు వివిధ విడో కార్యాలయాల్లో రైతులు ఆందోళన నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర లభిస్తుందని తాముల ద్వారా ధాన్యాన్ని అప్పయించినప్పటికీ విండో సిబ్బంది మిల్లర్లు కుమ్మక్కై తమను దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల పేరుతో మిల్లర్లు వేధింపులకు గురి చేయడం సరికాదని చేయడం సరికాదని రుద్రూర్ విండో కార్యదర్శి గంగాధర్ ను రైతులు నిలదీశారు. జిల్లా కలెక్టర్ స్పందించి బోధన్ డివిజన్లోని మిల్లర్లు ఆగడాలను అరికట్టాలని వారి నుండి రైతులను కాపాడాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి

- శ్రీకాళహస్తి దేవస్థానంలో జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు


శ్రీకాళహస్తి ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)



జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని, వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో మళ్లీ ప్రజల సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షిస్తూ, ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తి దేవస్థానంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, శాస్త్రోక్తంగా చండీ హోమంమృత్యుంజయ హోమం, నిర్వహించారు. పవన్ కళ్యాణ్ కి ఆ దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొట్టేసాయి ప్రసాద్, ఏర్పేడు మండల అధ్యక్షుడు కిరణ్ రామిశెట్టి, కుమార్, జయప్రకాష్, గరికపాటి చంద్ర, మాధవ్ మహేష్, ఈర్ల చిరంజీవి, ఢిల్లీ బాబు, లీలాధర్, మోహన్,తేజ,జయరాం తదితరులు చండీ హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. "లక్షలాది మంది ప్రజల ఆశాజ్యోతి అయిన పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆ పరమశివుడిని వేడుకున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ఎంతో కీలకం. వారు క్షేమంగా తిరిగి వచ్చి, మరింత ఉత్సాహంతో ప్రజా సేవలో పాల్గొనాలని ఆ దేవుని కోరుకున్నారు.

## కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు

కుప్పం,ఏప్రిల్ 19 (జన సంఘర్షణ):





ఆంధ్రప్రదేశ్‌కు కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీకి ఆయన ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి సమీపంలోని నిడదవోలు నుంచి విశాఖపట్నం సమీపంలోని దువ్వాడ వరకు 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెన నిర్మించనున్నారని చంద్రబాబు తన ట్వీట్లో పేర్కొన్నారు. ఈ కొత్త లైన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రయాణికులకు, సరుకు రవాణాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లలో అన్నదానం

- సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా 76 లక్షల రూపాయల విరాళం.

కుప్పం,ఏప్రిల్ 19 (జన సంఘర్షణ):



రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. ఏప్రిల్ 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు 76వ పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్లకు నారా భువనేశ్వరి రూ.76 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు సీఎం క్యాంప్ కార్యాలయంలో చెక్‌ను అన్న క్యాంటీన్ సీఈవోకు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం అయిన ఏప్రిల్ 20న రాష్ట్ర వ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్లలో పూర్తి ఉచితంగా భోజనం అందించాలని భువనేశ్వరి కోరారు. దీంతో ఇందుకు తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# తమపై దాడులు చేశారు న్యాయం చేయండి

- కంటిలో కారంపొడి చల్లి రాడ్లతో కట్టలతో కొట్లాట ఎవరు కాపాడేనాదులు లేక బాధితురాలు విలవిల కొట్టుకుంది.
- దీనిపై ఉన్నత అధికారులు నిజామబాద్ జిల్లా స్థాయి పోలీస్ అధికారి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- ఇలాంటి పరిస్థితి మరి ఎవరికి రాకూడదని గ్రామస్తులు శాంతి విధంగా ఉండాలని కొందరు గ్రామస్తులు ఆవేశం చెందుతున్నారు.

వర్ని/ చింతల్ పేట్/ఏప్రిల్19/ (జన సంఘర్షణ)





నిజామాబాద్ జిల్లా వర్ని మండలం చింతల్ పెట్ గ్రామానికి చెందిన ప్రేమ్ సింగ్ అదేవిధంగా ఆయన సతీమణి మీద మాజీ జెడ్పిటిసి హరిదాస్ ఆయన కుమారులు కుటుంబ సభ్యులు కలిసి అత్యంత దాటంగా దాడి చేయడం జరిగిందని దీంట్లో తల పగలడం జరిగిందని తీవ్ర రక్తపు మడుగులో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లడం జరిగిందని బాధితులు అన్నారు. వ్యవసాయ భూమి విషయంలో కొనుగోలు అమ్మకాల విషయంలో పైసల విషయంలో ఈ గొడవ జరిగిందని బాధితులు తెలపడం జరిగింది. తమకు మాజీ జడ్పీటిసి హరిదాస్ ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బంది పాలు చేస్తున్నారని విచక్షణ రహితంగా కర్రలు ఇతర వస్తువులతో దాడి చేయడం జరిగిందని అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్కు ఆశ్రయించడం జరిగిందని ఫిర్యాదు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి హరిదాసు కు వివరణ కోరగా తాము ఎవరిపై దాడులు చేయలేదని వారే తమపై దాడులు చేయడం జరిగిందని తాము సైతం ఫిర్యాదు ఇచ్చి ఉన్నామని అన్నారు. పొలం విషయంలో రిజిస్టర్ చేయడం లేదని పైసలు ఇవ్వడానికి తాము ఎప్పుడు సిద్ధమని కావాలని గొడవలు సృష్టిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు వివరణ కోరగా ఈ విషయంలో పొలంను అమ్మకం చేసిన వారు రిజిస్టర్ చేయడానికి ముందుకు వస్తలేరని మాజీ జడ్పీటిసి హరిదాస్ పైసలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని ఈ విషయంలో గొడవ జరిగింది వాస్తవమేనని అన్నారు. ఈ సందర్భంగా వర్ణి ఎస్పైని వివరణ కోరగా ఇరువర్గాల వారు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్లు నమోదు చేయడం జరిగిందని సమాధానం ఇచ్చారు. విచారణ కొనసాగుతుందని అన్నారు.

## చక్రేశ్వర గోశాలకు 200 గడ్డి కట్టలు కట్టింపు

తెలంగాణ బీర్కూర్/ఏప్రిల్19/ ( జన సంఘర్షణ)



బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలె రమేష్ డాక్టర్ ఆధ్వర్యంలో కోటగిరి మండలం బస్వపూర్ గ్రామస్థుల సహకారంతో బస్వపూరు గ్రామం నుండి బోధన్ ఏక చక్రేశ్వర గోశాలకు 200 గడ్డి కట్టలు కట్టించి స్వతహాగా వారి 3 ట్రాక్టర్ల లో జమచేసి తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో గొసేవకులు/ దాతలు: సర్పంచ్ రెడ్డి రామకృష్ణ, పుట్ట శ్రీధర్, హన్మంతు పటేల్, ప్రకాష్ నాయక్, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో ఎన్నికల ప్రచారానికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

కుప్పం,ఏప్రిల్ 19 ( జన సంఘర్షణ):



ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమిళనాడు వెళ్లనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, హోసూరు, తల్లి, ఆవడి, మధురైలలో ఎన్డీఏ పక్షాల అభ్యర్థుల తరపున సీఎం ప్రచారం నిర్వహించనున్నారు. అమరావతి నుంచి కోయంబత్తూరుకు ముఖ్యమంత్రి వెళ్తారు. మధ్యాహ్నం 1 గంటకు కోయంబత్తూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. అనంతరం హోసూరు నుంచి తల్లి చేరుకుని సాయంత్రం 4.45 గంటలకు ప్రచార ర్యాలీకి హాజరవుతారు. రాత్రికి చెన్నై చేరుకుని ఆవడిలో జరుగనున్న రోడ్ షోలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు.

# ఖమ్మంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శలు

ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ )



ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కనిపించడం లేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా విమర్శించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్నప్పటికీ, ఖమ్మంలో అభివృద్ధి జరగడం లేదని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆయన అన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ షష్టిపూర్తి సందర్భంగా ఖమ్మం మమతా మెడికల్ కాలేజీ మైదానంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై వేధింపులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ దూకుడును అడ్డుకున్నామని, రాబోయే రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ విజయ పతాకాన్ని ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ఇతర రాష్ట్రాల నాయకులు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎంపీలు గట్టిగా తిప్పికొట్టామని, అయితే రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని బీఆర్ఎస్‌ను మరింత బలపరచాలని, కల్వకుంట్ల చంద్రశేఖర రావును మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆకాంక్షించారు.

# మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభం

రామకుప్పం ఏప్రిల్ 19 (జన సంఘర్షణ)



వేసవి పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక వల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ పివి సీతాపతి ప్రారంభించారు. ఎండ తీవ్రత వల్ల జనం తల్లి వెళ్ళిపోతున్న తరుణంలో తమ వంతు సాయంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా మజ్జిగ కార్యక్రమం పంపిణీకి దాతలు సహకరించడంతో నిత్యం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం మార్గంలో వెళ్లే ప్రజలు భక్తులు ఇతరులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు మజ్జిగ సేవించిన పలువురు ఆలయ కమిటీ సభ్యులను ప్రశంసిస్తూ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నారు

# బస్సు డ్రైవర్‌పై దాడి...ఇద్దరిపై కేసు నమోదు

ఏప్రిల్ 19, జన సంఘర్షణ :
తాము కోరినచోట బస్సు ఆపలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై దాడికి పాల్పడి, గాయ పర్చిన సంఘటన నాగలాపురంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నాగలాపురం ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల మేరకు నాగలాపురం మండలం అనామత్తు కండ్రిగకు చెందిన కె. బాబు (40) సత్యవేడు డిపోలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులలో భాగంగా ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం సత్యవేడు నుంది తిరుపతికి వెళుతుండగా ఊత్తుకోట అంబేద్కర్ సర్కిల్ వద్ద బస్సు ఆపే విషయంలో నాగలాపురంకు చెందిన కొంతమంది వ్యక్తులతో డ్రైవర్ బాబుకు వాగ్వివాదం జరిగింది. అనంతరం అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణంలో 9 గంటలకు నాగలాపురం కళ్యాణ మండపం సమీపంలో నాగలాపురం ఈస్ట్ హరిజనవాడకు చెందిన కాళియప్పన్ మరొక వ్యక్తి బస్సును అడ్డగించి డ్రైవర్ కండక్టర్‌ను దుర్భాషలాడి బస్సులోనికి ప్రవేశించి డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. డ్రైవర్, కండక్టర్ మొబైల్ ఫోన్లు, బస్సు తాళాలు బలవంతంగా తీసుకొని, భవిష్యత్తులో తాము చెప్పిన చోట బస్సు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారు. ఈ ఘటన కారణంగా డ్రైవర్ ప్రభుత్వ విధుల్లో అంతరాయం కలగడంతో పాటు బస్సులో ఉన్న ప్రయాణికులకు అసౌకర్యం కలిగింది. అనంతరం నిందితులు మొబైల్ ఫోన్లు, బస్సు తాళాలు తిరిగి ఇచ్చి అక్కడి నుండి వెళ్లిపోయారు. గాయపడిన డ్రైవర్ బాబును డిపో యూనియన్ నాయకులు సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. డ్రైవర్ బాబు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన కాళియప్పన్ వేలుమురుగన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సునీల్ స్పష్టం చేశారు..

## ప్రతి ఏటా ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడం స్కాలర్స్ కళాశాల సొంతం

- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**
- **రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**







తెలంగాణ హైదరాబాద్/ఏప్రిల్19/(జన సంఘర్షణ)
ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో వనపర్తి పట్టణంలో గల స్కాలర్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి విద్యార్థులకు శాలువతో సన్మానించారు. చిన్నా రెడ్డి మాట్లాడుతూ.. స్కాలర్స్ కళాశాలకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1991 ఇప్పించానని అన్నారు. కళాశాల యజమాన్యం డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి లు తమ తమ సబ్జెక్టుల నైపుణ్యాలతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మీరే భవిష్యత్ భారత నిర్మాతలు కాబట్టి లక్ష్యాలను ఉన్నతంగా పెట్టుకొని ఉన్నతంగా ఎదిగి పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలని కోరారు. ఉన్నతంగా ఎదిగిన మీరు కష్టపడి చదివించిన మీ తల్లిదండ్రులను మరవకుండా ,మీకు ఉన్నత విద్యను బోధించిన ఉపాధ్యాయులను మరువకూడదు అని అన్నారు. నీట్, ఐఐటీ, జేఈఈ, ఎన్ఐటీ ఫలితాలలో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి స్కాలర్స్ కళాశాలకు వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ద్వితీయ సంవత్సరం బైపిసి మహాలక్ష్మి 993, ప్రథమ సంవత్సరం బైపిసి పల్లవి437, నిమ్ర అప్సన్437, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ నర్మద 992 ప్రథమ సంవత్సరం ఎంపీసీ బన్నీ 463 మార్కులు సాధించిన విద్యార్థులను చిన్నారెడ్డి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, సీనియర్ నాయకులు నందిమల్ల రామ్, మణిగిల్ల బాల్ రాజు, సిరివాటి సురేష్, యుగంధర్ రెడ్డి, రామ్ సింగ్ నాయక్ పాల్గొన్నారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవం “ఇందిరమ్మ ఇళ్లు”



తెలంగాణ నర్సాపూర్/ఏప్రిల్19/( జన సంఘర్షణ)
రాష్ట్రంలో ఆడబిడ్డల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని, పేదల సొంతింటి కల నెరవేర్చడంలో ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంలో ఆవుల లక్ష్మి-రాజు దంపతులకు చెందిన ఇందిరమ్మ ఇళ్లును మంత్రి ధనసరి అనసూయ సీతక్క, కలెక్టర్ దివాకర లతో కలిసి మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు సారెలుపెట్టి ఆశీర్వదించారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇళ్లని, అందుకోసమే వారి పేరు మీదే ఇండ్లును మంజూరు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో 4లక్షల 50వేల ఇండ్లు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నా ఇంటి ఆడపడుచులకు సారె అందిస్తున్నా: ఎంపీ వేమిరెడ్డి

- **మహిళా ఉద్యోగినుల మధ్య ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు.**
- **మహిళలకు విపిఆర్ ఆత్మీయ పలకరింపు**
- **సీఎం చంద్రబాబు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ల జన్మదినం సందర్భంగా మహిళా ఉద్యోగులకు ‘సారె’**

నెల్లూరు జిల్లా, జన సంఘర్షణ :
నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు కోవూరు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వేలాది మంది మహిళా ఉద్యోగినులు తరలివచ్చి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఎంపీ వేమిరెడ్డి కేక్ కట్ చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని శానిటేషన్, అంగన్వాడీ, మెడికల్, రెవెన్యూ, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ వంటి అన్ని శాఖల మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికుల నుండి తహసీల్దార్ల వరకు, ఆశా వర్కర్ల నుండి వైద్యుల వరకు అందరూ ఒకే వేదికపైకి రావడం విశేషం. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రతి మహిళా ఉద్యోగినికి ‘సారె’ అందజేసి తన సోదరభావం చాటుకున్నారు. 20న సీఎం చంద్రబాబు జన్మదినం ఉన్న నేపథ్యంలో ప్రతి మహిళను గౌరవిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాల్లోకి వచ్చాక తన పుట్టినరోజును ఇంత మంది అక్కచెల్లెళ్ల మధ్య, ఒక కుటుంబ వాతావరణంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సేవ చేయాలనే సంకల్పానికి అధికారం తోడైతే ప్రజలకు చేరువై మరిన్ని సేవా కార్యక్రమాలు చేయవచ్చనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇకపై ప్రతి ఏటా నా జన్మదిన వేడుకలను ఇలాగే మహిళా ఉద్యోగినుల మధ్య జరుపుకుంటానన్నారు.

రేపటి నుంచి కోవూరులో విపిఆర్ నేత్ర సేవలు ప్రారంభం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని రేపటి నుండి కోవూరు నియోజకవర్గంలో విపిఆర్ నేత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రకటించారు. గత ఏడాది నవంబర్ నుండి ఉదయగిరిలో సుమారు 40 వేల మందికి ఉచిత కంటి పరీక్షలు చేసి 22 వేల మందికి పైగా కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాలలో ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందివ్వాలన్న లేటెస్ట్ ఎక్యూప్మెంట్ వున్న రెండో మొబైల్ బస్సును కోవూరు నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీ వేమిరెడ్డి వెల్లడించారు. కోవూరు ప్రజలు విపిఆర్ నేత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




## గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులు




శ్రీకాళహస్తి ఏప్రిల్ 19 జన సంఘర్షణ:
బడుగు వర్గాల పోరాట యోధులు,భారత దేశంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత ప్రజలచేత సర్దార్ అని పిలుపించుకున్న ఏకైక తెలుగు వ్యక్తి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్ధార్ గౌతు లచ్చన్న. వారి 21వ వర్ధంతిని పురస్కరించుకుని, శ్రీకాళహస్తి పట్టణంలో జడ్పీ బాయ్స్ స్కూల్ ఎదురుగా ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న వర్ధింతి సందర్భంగా వారి విగ్రహానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ్ సంక్షేమ సంఘం జిల్లా లీగల్ ఆధ్వజర్ ఉదయగిరి మోహన్ గౌడ్ మాట్లాడుతూ..శ్రీకాకుళం జిల్లా బారువా గ్రామంలో ఒక సామాన్య కుటుంబ జన్మించిన గౌతు లచ్చన్న అణగారిన వర్గాల అభ్యున్నతికి కోసం అనేక పోరాటాల చేసిన మహానీయుడనీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, వి.వి.గిరి, మొదలగు అనేక మంది జాతీయ నాయకులతో కలసి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్ని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లినారు. మంత్రిగా పనిచేసే సందర్భంలో రాష్ట్రంలో మద్యపాన నిషేధం విధించాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి ప్రకాశం పంతులు ప్రభుత్వాన్ని పతనానికి . ఏప్రియల్ 19 2006లో వారు తుదిశ్వాస విడిచారునీ తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీతిరుపతి గౌడ్, సంక్షేమ జిల్లా అధ్యక్షులు తిరుకాల పురుషోత్తం గౌడ్ , శ్రీకాళహస్తి నియోజకవర్గం గౌడ్, సంక్షేమ సంఘం చైర్మన్ పర్వతాల చంద్రశేఖర్ గౌడ్, అధ్యక్షులు తిరుకాల ఆనంద్ గౌడ్, జిల్లా ఉపాఅధ్యక్షులు జడపల్లి లోకేష్ గౌడ్ , అట్ల కృష్ణయ్యగౌడ్, రవి మెస్ గౌడ్, యూత్ ప్రెసిడెంట్ ఉదయ్ గౌడ్ అత్తిరాల నారాయణ గౌడ్ అనేం నాగేశ్వరావు గౌడ్ సుబ్రహ్మణ్యం నియోజకవర్గంప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

- **శుభాకాంక్షలు తెలిపిన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా**
- **ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించిన శివరాజ్ సింగ్ చౌహాన్, పల్లా శ్రీనివాసరావు తదితరులు**



నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ:
నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు దేశ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ మేరకు ఎక్స్ ఖాతాల్లో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆకాంక్షించారు. మాజీ సీఎం శివరాజ్ సింగ్ ఛౌహాన్, మంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవించంద్ర తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు సుప్రియా సూలే, పోలంరెడ్డి దినేష్ రెడ్డి తదితరులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా విషెష్ తెలియజేశారు. వారి ఆప్యాయ శుభాకాంక్షలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పందిస్తూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు.

## భూగనజీవామృతం తయారీ, వాతావరణ పురుద్ధరణ కార్యక్రమం..

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19 జన సంఘర్షణ
శ్రీకాళహస్తి మండలం, వేడం పంచాయతి పరిధిలోని పెద్దమిట్ట కండ్రిగ గ్రామంలో ప్రజా సాధికారిక ట్రస్ట్, అమెక్సా ఆధ్వర్యంలో భూ గనజీవామృతం తయారీ, వాతావరణ పురుద్ధరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగం గా భూమిహిత వాలంటీర్ల చేత గనజీవామృతం తయారు చేయబడింది. ఈ గ్రామానికి చెందిన రైతులు జయలలిత, మునెమ్మ, రామకృష్ణులు ఆకుకూరలు, వరి, కూరగాయల పంటలను సాగు చేస్తూ సహజ వ్యవసాయాన్ని ఆచరిస్తున్నారు. గనజీవామృతం భూసారాన్ని పెంచడానికి, నేలలో సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడుతుందని వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవచ్చని ప్రజా సదికారికా ట్రస్ట్ వారు అవగాహన కల్పించటం జరిగింది .రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించి, సహజ పద్ధతులను పాటించడం ద్వారా నేల సారాన్ని పెంపొందించడంతో పాటు తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన పంటలను సాధించవచ్చని అన్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండేందుకు భూసారాన్ని పెంచడంలో గనజీవామృతం ఉపయోగించాలని తెలిపాము. ఈ కార్యక్రమంలో ప్రజా సాధికారిక ట్రస్ట్ కోఆర్డినేటర్ సి. వెంకమ్మ, ఆర్గనైజర్ ఎ. కళ్యాణితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

**దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**హైదరాబాద్, :** నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన పక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

**డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు**

**అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం**

**తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్**

**చెన్నై, ఏప్రిల్18 :** మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి
ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## కాంగ్రెస్‌కు ఉద్యోగుల ఉసురు తప్పదు

**ఉద్యోగుల జీతభత్యలు సకాలంలో ఇవ్వడం లేదు**

**పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు**

**ఐదు డీఎలు పెండింగ్‌లోనే ఉన్నాయి**

**ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్**

**హైదరాబాద్, :** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు.ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ
సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల

# పులి బయటకు వస్తే.. ఎన్ని మేకలన మింగిందో చెబుతాం

**ఎన్ని ఆవులను తిన్నదో బయటపెడతాం**

**కెసిఆర్ జగిత్యాల సభపై పిసిసి చీఫ్ సెటైర్లు**

**హైదరాబాద్, :** పులి బయటకు వస్తే సంగతి చెబుతామని పరోక్షంగా కెసిఆర్ ను ఉద్దేశించి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. పులి ఎన్ని మేకలు తిన్నదో చెబుతామని.. పులి ఎన్ని ఆవులను మింగిందో చెబుతామని పేర్కొన్నారు. పులి ఆసరా తీసుకొని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో బయటపెడుతామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో పాల్గొననున్న మీటింగ్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పులి ఏం చేసిందో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలు బయటపెడతామని హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రనే లేదని మహేశ్ గౌడ్ విమర్శలు చేశారు. బీజేపీ ఎంపీలు యాక్సిడెంటల్ లీడర్స్ అని ఆక్షేపించారు. మతాల మధ్య చిచ్చు, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు ఏం తెలియదని సెటైర్లు గుప్పించారు. కర్ణాటక ఎంపీ తెలంగాణను కించపరిస్తే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోయారా..? అని ధ్వజమెత్తారు. నలభై ఏళ్లలో కిషన్‌రెడ్డి ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా..? అని ప్రశ్నించారు.మహిళా సాధికారతపై కాంగ్రెస్, బీజేపీకి చాలా తేడా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తొలి మహిళా ప్రధాని, రాష్ట్రపతిని చేసింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. సోమవారం మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని.. కానీ ఈ బిల్లు ముసుగులో మోదీ ప్రభుత్వం డీ లిమిటేషన్ చేయాలనే ప్రయత్నం చేసిందని ఆగ్రహించారు. అక్రమంగా బిల్లును పాస్ చేయాలని కుట్ర చేశారని ఆరోపించారు. ఈ బిల్లు వీగిపోవడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. అహంకారంతో ఉంటామంటే నిన్నటిలా జరుగుతుందని అన్నారు. ఉత్తర భారతదేశానికి ఎక్కువ సీట్లు ఇచ్చే ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని చెప్పుకొచ్చారు. బీజేపీ నియంతృత్వ పోకడకు చెక్ పడిందన్నారు. ఈ బిల్లు వీగిపోవాలనే డీ లిమిటేషన్‌తో ముడిపెట్టారని తెలిపారు. తెలంగాణలో రెడ్డి ముఖ్యమంత్రి బీసీ కుల గణన చేశారని పేర్కొన్నారు. కిషన్‌రెడ్డికి మహేశ్ కుమార్ గౌడ్ సవాలు విసిరారు. జై శ్రీరామ్ అనకుండా కిషన్‌రెడ్డి గెలవగలరా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే మిషన్ రెడ్డికి శ్రీరాముడు కావాలని విమర్శించారు. జై శ్రీరామ్ అనకుండా తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసి కిషన్‌రెడ్డి గెలవగలరా..? అని నిలదీశారు. జై శ్రీరామ్ అనకుంటే బీజేపీకి మనుగడ లేదని అన్నారు. దేవుడి పేరు చెబితే ఓట్లు రాలే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తేజస్వీ చిన్న పిల్లోడని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. తేజస్వీ దేవుడి పేరు చెప్పుకొని గెలిచిన వారని విమర్శించారు. ఆయన యాక్సిడెంటల్‌గా ఎంపీ అయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటక గురించే తేజస్వికి ఏమాత్రం తెలియదని అన్నారు. తెలంగాణ గురించి తేజస్వికి ఏం తెలుసని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లను బీసీలకు ఇచ్చామని స్పష్టం చేశారు. మనువాద బీజేపీకి మహిళలకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అత్యధికంగా మహిళా నాయకులను తయారు చేసింది కాంగ్రెస్ అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ఆనందం

**దేశాన్ని విభజించే కుట్రలను ఆపారు**

**వారందరికీ ఎన్నో కృతజ్ఞతలు**

**ఎక్స్ వేదికగా స్టాలిన్ వెల్లడి**

**చెన్నై, :**
లోక్‌సభలో శుక్రవారం రాజ్యాంగ 131 సవరణ బిల్లు 2026 వీగిపోయింది. దీంతో నల్లచట్టమైన డీలిమిటేషన్‌ని కేంద్రం ఉపసంహరించుకుంది. డీలిమిటషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసిన పోరాటం పార్లమెంటులో విజయం సాధించిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. దానిని ఓడించినందుకు ఇండియా బ్లాక్ ఎంపీలకు, మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్టు చేశారు. నేను ఆనందంతో, నూతన శక్తితో మీ ముందు నిలబడ్డాను. డీలిమిటేషన్ అనే నల్లచట్టానికి వ్యతిరేకంగా మన పోరాటం విజయవంతమైంది. ఈ ప్రమాదాన్ని ఏడాది క్రితమే ఊహించి, ఈ విజయాన్ని సాధించడానికి అవసరమైన పనులన్నీ అప్పుడే మొదలుపెట్టాము. మొదట ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకుల సమన్వయ సమావేశంతో మొదలుపెట్టి, మొన్న మేము నల్లజెండా ఎగురవేసి నల్లచట్టం ప్రతిని దహనం చేశాము. అప్పుడు నేను దహనం చేసిన ప్రతిల మంటను వ్యాపించనివ్వండి అని నేను అన్నాను. అదే నిన్న
పార్లమెంటులో కూడా మంటలు చెలరేగాయి' అని స్టాలిన్ వీడియోలో అన్నారు. హిళా రిజర్వేషన్ల నెపంతో మోసపూరిత ప్రయతాన్ని ప్రతిఘటించిన తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా మహిళలను ఆయన ప్రశంసించారు. అలాగే శుక్రవారం పార్లమెంటులో 50,60 వ దశకాల నాటి పాత డిఎంకెని చూడడం అంటే ఏమిటని అడుగున్న కొంతమంది అపరిపక్వ వ్యక్తులతో 'ఇదే డిఎంకె' చూడండి' అని నేను చెప్పాను. నిన్న మేమ దాన్ని బలంగా చూపించాం అని స్టాలిన్ వీడియో సందేశంలో అన్నారు. పార్లమెంటులో దీనిని ఓడించిన ప్రతి ఒక్కరికీ తాను కత్రృతజ్ఞతలు తెలిపారు. ఇండియా బ్లాక్ పార్టీలతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఏకతాటిపై నిలబడటం వల్లే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. దేశాన్ని విభజించే ప్రయత్నాల కు ఇది భారీ దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రతిపక్ష పార్టీల మధ్య పెరుగుతున్న ఐక్యతను ప్రదర్శిస్తోందని ఆయన తెలిపారు. ఇది మోడీ ప్రభుత్వానికి ఆరంభం మాత్రమే. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 12 ఏళ్లలో తొలిసారిగా పార్లమెంటులో వీగిపోయిందని ఆయన ఎత్తిచూపారు. ప్రతిపక్ష పార్టీల సభ్యులకు ఈ సందర్భం స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.
------

# హర్మ్యూజ్‌పై మళ్లీ పీటముడి

మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన
టెహ్రాన్ పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. హోర్ముజ్ జలసంధి తెరుచుకుందనే ఆనందం 24 గంటలు కూడా నిలవలేదు. మళ్లీ హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా తమ నౌకలపై విధించిన సముద్ర నిర్బంధం కొనసాగు తుండడమే ఇందుకు కారణమని టెహ్రాన్ పేర్కొంది. హోర్ముజ్‌పై కట్టుదిట్టమైన నియంత్రణ విధించినట్లు ప్రకటించింది. అమెరికా తన నిర్బంధాన్ని ఎత్తివేయకపోతే జలసంధి పూర్తిగా తెరవబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. హోర్ముజ్‌ను తెరిచినప్పటికీ ఇరాన్ నౌకలపై తమ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించడం ఉద్రిక్తతలను పెంచింది. హోర్ముజ్ జలసంధి గురించి, శాంతి ఒప్పందం గురించి ట్రంప్ సోషల్ మీడియాలో చేస్తున్న పోస్ట్‌లన్నీ అబద్ధాలేనని, దౌత్య చర్చలపై ముందుకు సాగుతుండగా ఇలాంటి తప్పుడు సమచారాన్ని ఇరాన్ అంగీకరించదని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య ఏప్రిల్ 20న రెండో దఫా శాంతి చర్చలు జరగబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగానే ఇవి జరగబోతున్నట్టు ఇరాన్ మీడియా పేర్కొంటోంది. అయితే ఈ శాంతి చర్చలు వేదిక, తేదీ గురించి అమెరికా ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఈ క్రమంలో హర్మ్యూజ్ జలసంధిని తెరుస్తామని ప్రకటించిన ఇరాన్ మళ్లీ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. శనివారం తాజాగా మళ్లీ మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్భందనం ఉన్నంత వరకు హర్మ్యూజ్ జలసంధిని మూసివేసి రవాణాను అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందానికి వచ్చే వరకు ఈ జలసంధి దిగ్భంధనం కొనసాగుతుందని ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ హర్మ్యూజ్‌ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.కాగా, ట్రంప్ శనివారం 'కొన్ని మంచి వార్తలున్నాయని చెప్పుకొచ్చారు. బుధవారంలోగా ఒప్పందం కుదరకపోతే యుద్ధంలో కాల్పుల విరమణను పొడిగించకపోవచ్చని ఆయన అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

## పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

**అమరావతి,** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగింది. పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం పాలనా పరమైన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలో పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వ్యక్తిగత వైద్యుల సలహాతో కార్యక్రమాలను రద్దు చేసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లారు. పలు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేశారు. కనీసం 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, దీర్ఘకాలం పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. పూర్తి స్వస్థత చేకూరేందుకు కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ అపోలోలో ఆయన ముక్కుకు శస్త్రచికిత్స జరిగినట్లు తెలుస్తోంది.

## మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలకు బుద్ధి చెప్పండి

**కోయంబత్తూరు సభలో ప్రధాని మోడీ పిలుపు**

**చెన్నై, :** మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాలపై కోయంబత్తూర్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. మహిళల కోసం చేసిన మంచి ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని, చేసిన తప్పులకు విపక్షాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మహిళల అభ్యున్నతి కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బిల్లును అడ్డుకున్నందుకు డీఎమ్‌కే నేతలను ప్రజలు ప్రశ్నించాలన్నారు. సామాన్య మహిళలను ఎంపీ, ఎమ్మెల్యేలను చేయడమే తన సంకల్పమన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు క్రెడిట్‌ను విపక్షాలే తీసుకోవాలని కోరానని చెప్పారు. మోదీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ .. 'మహిళా రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాం. కాంగ్రెస్, డీఎంకే కలిసి బిల్లును

అడ్డుకున్నాయి. డీఎమ్‌కే నేతల చీకటి పనులు ప్రజలకు తెలుసు. నా బాధను పంచుకోవడానికే ఇక్కడికి వచ్చా. రిజర్వేషన్ల కోసం మా పోరాటం ముగియలేదు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం దారుణం. ఈ నెల 23న కాంగ్రెస్, డీఎమ్‌కే నేతలకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని తమిళనాడు ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళా బిల్లును వ్యతిరేకించి విపక్షాలు తప్పు చేశాయని అన్నారు. మహిళలకు ప్రతిపక్షాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిల్లును వ్యతిరేకించిన విపక్షాలు శిక్ష అనుభవిస్తా యని అన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

**విశాఖ ఆర్కె బీచ్‌లో అవగాహనలో హోంమంత్రి అనిత**

**విశాఖపట్నం, :** అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, ప్రజలు ఏ విధంగా జాగ్రత్తగా ఉండాలో డెమోలో అధికారులు వివరించారుని తెలిపారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో ఆకట్టుకుంది. మెగ్గా÷ర్ సర్వీస్ డెమోను అతిథులు, నగరవాసులు

ఆసక్తిగా తిలకించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే అమూల్యమైన పాత్రను అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. 2018లో అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. 2019 నుంచి 2024 వరకు అగ్నిమాపక శాఖను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇటీవల రూ. 232 కోట్లతో్గ÷ర్ వెహికల్స్ కొనుగోలు చేశామని ప్రస్తావించారు. సీఎం చంద్రబాబు ఈ వాహనాలను కూడా ప్రారంభించారని అన్నారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగిస్తున్నామని వివరించారు. టెక్నాలజీని ఉపయోగిస్తూ, డ్రోన్లు వాడుతున్నామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## రాముడిపై అనుచిత వ్యాఖ్యలు

**బేషరతుగా క్షమాపణలు చెప్పాలి**

**లేదంటే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాలి**

**విశ్వహిందూపరిషద్ తీవ్ర హెచ్చరిక**

**అమరావతి, ఏప్రిల్18** సినీ నటుడు ప్రకాష్ రాజ్.. శ్రీరాముడిపై చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై విశ్వ హిందూ పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. హిందూ సమాజానికి ప్రకాష్ రాజ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. క్షమాపణలు చెప్పకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. అమరావతిలో మీడియాతో మాట్లాడిన విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రకాష్ రాజ్ తన వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు.. ప్రకాష్ రాజ్ జాతీయతకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, దేశ భావజాలాన్ని అవమానించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు సత్యరవకుమార్.. ఆయన ప్రవర్తన హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉందని అన్నారు. శ్రీరాముడిని అవమానించినందుకు హిందువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వీహెచ్‌పీ స్పష్టం చేసింది. లేనిపక్షంలో ఃజీతీసజీనిణ ఆజీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. ప్రకాష్ రాజ్‌పై హిందూ సమాజం మొత్తం కలిసి క్రిమినల్ కేసులు వేస్తామని, ఆయన సినిమాలను బహిష్కరించాలని కూడా పిలుపునిచ్చారు. దర్శకులు, నిర్మాతలు, ఇతర హీరోలు తమ సినిమాల్లో ప్రకాష్ రాజ్‌కు అవకాశాలు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రకాష్ రాజ్ నుంచి దీనిపై స్పందన రావాల్సి ఉంది.

# మాదక ద్రవ్య రహిత సమాజం కోసం పోరు

**ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పిలుపు**

**కర్నూలు, :** గంజాయి మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం కలిసి పోరాడాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి బి సావిత్రి పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య భవన్ లో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో యువత డ్రగ్స్ కి మద్యనీ అలవాటయ్యి మహిళల పైన హత్యలు, మానభంగాలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరు, కడప, విశాఖ, మదనపల్లి, కర్నూలు జిల్లాలో, ఇలా చెప్పుకుంటూపోతే రాష్ట్రవ్యాప్తంగా కూడా అనేక హత్యలు మహిళలపైన ఎక్కువ జరుగుతున్నాయి. ఒక్క నెలలో 18 కేసులు అత్యాచారాలకు మర్డర్లకి మహిళలు గురయ్యారు .దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఏ రాజకీయ పార్టీలోఉన్న నాయకులు డ్రగ్స్ మాఫియాకుఅండగా ఉంటారో వారిని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులకు గాని పార్టీ సభ్యత్వానీ నుండి తొలగించాలని పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి. వాళ్లపైన పార్టీలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేస్తుంది. మద్యాన్ని కంట్రోల్ చేయాల్సిన ప్రభుత్వాలే నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేశారు,ఇది సరైనది కాదని తెలియజేశారు. ఏదైనా యువతకు నాణ్యమైన విద్య నాణ్యమైన ఆహారము నాణ్యమైన వైద్యం అందించాలని ఐద్వా డిమాండ్ చేసింది.మహిళలకుఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మద్యం, డ్రగ్స్ , కంట్రోల్ చేసి యువతకు మంచి భవిష్యత్తు అందించాలని మహిళల మానప్రాణాలను కాపాడాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ

లేకుండా పోయిందని పరువు హత్యలు ఎక్కువైనాయని చిన్న పిల్లలకి ఎక్కడ రక్షణ లేకుండా పోయిందని ఇవన్నీటికీ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి అగత్యాలకు పాల్పడిన వాళ్ళని కఠినంగా శిక్షించాలని విమర్శించారు. భవిష్యత్తులో ప్రజలందరూ గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాల పైన కలిసి వచ్చే సంఘాలతో కలిసి వచ్చే మేధావులు అందరిని కలుపుకొని ఆందోళనకు సిద్ధమవుతమన్నారు. ప్రజా సంఘాలు మద్యానికి డ్రగ్స్ కి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని ఇది ప్రతి ఒక్కరి బాధ్యత గా స్వీకరించాలని తెలియజేశారు.

# దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

**విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం**

**జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి**

**కాకినాడ, :** ఇంటి నేరాలకు పాల్పడుతున్న ఒక దొంగను, అలాగే మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న మరో ఇద్దరు దొంగలను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.25 లక్షల ముప్పై వేలకు పైగా విలువైన 117 గ్రాముల బంగారం, 629 గ్రాముల వెండి అభరణాలు, 1 లక్ష 95 వేల నగదు ఐదు లక్షలు ఆరు విలువైన ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి బిందు మాధవ్ తెలిపారు. అలాగే కాకినాడ జిల్లాలో కాకినాడ వన్ టౌన్, టూ టౌన్, కోరంగి, సామర్లకోట పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో జరిగిన పది కేసులను ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. శనివారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయం లో ఎస్పీ బిందు మాధవ్ విలేకరులతో సమావేశం నిర్వహించి కేసులు వివరాలు వెల్లడించారు. కాకినాడ ఏటిమొగకు చెందిన రేకాడి వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై కాకినాడ పోర్ట్ పోలీసు స్టేషన్లో కేసు ఉన్నదని శనివారం కోరంగి వంతెన వద్ద ఉండగా ఎస్సై పి సత్యనారాయణ అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అలాగే మోటార్ సైకిల్ దొంగతనాలుకు పాల్పడుతున్న కాకినాడ రామారావు పేటకు చెందిన వనమాడి జానకిరామ్, మాడుగుల మండలం సత్యవరం గ్రామానికి చెందిన రేఖ సతీష్ అనే ముద్దాయిలను సామర్లకోట కాకినాడ రోడ్డులో ఈరోజు ఉదయం సామర్లకోట సీఐ ఎ కృష్ణ భగవాన్ అరెస్టు చేశారని వీరి నుంచి రూ.ఐదు లక్షల విలువైన ఆరు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముద్దాయిలు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి తాళాలు పగలగొట్టి ఇంటిలో ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతుంటారని చెప్పారు. కోర్టులో ముద్దాయిలను హాజరు పరిచినట్లు వెల్లడించారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తాళాలు బయటకు కనపడేలా వేసి ఉంచవద్దని ఆ తాళాలను అక్కడే దాచవద్దని పోలీసులు సూచించారు. అలాగే ఊరికి వెళుతున్న వారు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ కు తెలియజేస్తే వారు ఎల్హెచ్ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చి దొంగతనాలు జరగకుండా కాపాడుతారన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకరులలో దాచుకోవాలని, అవకాశం ఉన్నంతవరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. ఈ సమావేశంలో కాకినాడ డిఎస్పి మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్బి డిఎస్పి కే వి సత్యనారాయణ, సిసిఎస్ ఇన్స్పెక్టర్ వి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. కేసులు సాధనలోను ముద్దాయిలని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

# రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

**నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం**

**మండిపడ్డ జనసేన నేత నాగబాబు**

**అమరావతి :** ఇటీవల కేరళ సాహిత్యోత్సవంలో ప్రకాశ్ రాజ్ రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు చినికి చినికి గాలివానగా మారుతున్నాయి. రాముడు ఉత్తరాది కూలీ అని, దక్షిణాదికి వలస వచ్చాడని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలలో ఆయనపై రామభక్తులు కేసులు వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సైతం ప్రకాశ్ రాజ్‌పై పరువునష్టం దావా వేసి, లీగల్ నోటీసులు పంపారు. ఆయన సహ నటీనటులు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. మరికొందరైతే ప్రకాశ్‌రాజ్ నటిస్తున్న సినిమాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపు నిస్తున్నారు. ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుండి తొలగించాలని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, జనసేన శాసనమండలి సభ్యులు నాగబాబు సైతం ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. ట్విట్టర్ వేదికగా ఆయన తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'శ్రీరాముడు కేవలం హిందువుల దేవుడు మాత్రమే కాదు. ఆయన ధర్మానికి ప్రతీక. ఆయనను అవమానించడం లేదా తగ్గించాలని చూడటం ధైర్యం కాదు... అహంకారం! మానసిక అంధత్వం వల్ల జరిగే పొరపాటు అది' అని అన్నారు.రాముడిని ఎగతాళి చేసేవారు తమని తాము నష్టపర్చుకుంటున్నారని, అజేయమైన ధర్మాన్ని కాపాడే శక్తులు నిరంతరం పని చేస్తుంటాయని నాగబాబు అభిప్రాయ పడ్డారు. చరిత్రలో న్యాయానికి వ్యతిరేకంగా నిలిచినవారు పతనమయ్యారని, అదే విధంగా రాముడిపై విషం చిమ్మే వారి భవిషత్తు కూడా అదే అవుతుందని నాగబాబు అన్నారు. 'రాముడి పేరే ఓ కవచమని, ఆయన కథ ఖడ్గమని, ఆయన ఉనికి నాగరికతకు అచంచలమైన కోట' అని నాగబాబు ఆ పోస్ట్‌లో పేర్కొంటూ, ఇన్ డైరెక్ట్‌గా ప్రకాశ్ రాజుకు స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. తాజాగా ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి నాగబాబు మరో ట్వీట్‌ను పోస్ట్ చేశారు. 'ప్రకాశ్ రాజ్‌గారూ మీరు... నాస్తికుడినని చెప్పారు. అయితే మీ తల్లి అంత్యక్రియలను ఆవిడ విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకుని క్రైస్తవ పద్ధతిలో మీరు నిర్వహించారు. అది కొడుకుగా మీ బాధ్యత అని మేం గౌరవించాం. అదే భావనతో మీరు కోట్లాదిమంది నమ్మకాన్ని గౌరవించాలి. నాస్తికత్వం అంటే దేవుళ్ళను లేదా విశ్వాసాలను ఎగతాళి చేయడం కాదు. అది ఒక తార్కిక ఆలోచనా విధానం. హిందూమతం మాత్రమే నాస్తికత్వాన్ని కూడా ఓ తాత్విక ఆలోచనగా అంగీకరిస్తుంది. అలాంటి సంప్రదాయాన్ని నిర్లక్ష్యం చేయడం తార్కికత కాదు... అగౌరవపర్చడం. ఇతర దేశాల్లో అయితే ఇలాంటి మాటలు చెప్పినందుకు మీరు తీవ్రమైన ఇబ్బందులకు లోనయ్యేవారు. నేను మీ గురించి చేస్తున్న చివరి వ్యాఖ్య ఇదే. ఇక మీదట మీతో వాదించను' అని నాగబాబు తెలిపారు. మరి దీనిపై ప్రకాశ్ రాజ్ ఎలా స్పందిస్తాడో చూడాలి.

## దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేస్తాం

**బిజెపి ఎంపి లక్ష్మణ్ హెచ్చరిక**

**న్యూఢిల్లీ, :** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. ' మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co